## క్లుప్తంగా

### ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



మురళీకృష్ణను సత్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బృందావనం): వాహనచోదకులు ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించాలని ఆర్టీసీ నెల్లూరు ఒకటో డిపో మేనేజర్ మురళీకృష్ణ పేర్కొన్నారు. ఆచారివీధిలోని నెల్లూరు క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ హాల్లో ఆదివారం నిర్వహించిన ఆర్యవైశ్య సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. అనంతరం ఆయన్ను సత్కరించారు. జనవరి, ఫిబ్రవరిలో పుట్టిన రోజు జరుపుకొంటున్న సీనియర్ సభ్యులతో కేక్‌ను కట్ చేయించారు. అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు గుండ్లపల్లి శ్రీధర్‌రావు, చుండూరు కృష్ణమూర్తి, కోశాధికారి అద్దేపల్లి సుబ్బారావు, కృష్ణయ్య, బొమ్మిశెట్టి మురళీకృష్ణ, మెంటా మాల్యాద్రి, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

### పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న తిరుపతయ్య

నెల్లూరు(బృందావనం): జిల్లాలోని పెన్షనర్లు తమ సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తానని పెన్షనర్ల జిల్లా ఆడిట్ అధికారి తిరుపతయ్య పేర్కొన్నారు. భక్తవత్సలనగర్‌లోని పెన్షనర్ల సంఘ భవనంలో ఆదివారం నిర్వహించిన స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్సెమ్ గౌస్ మాట్లాడారు. పెన్షనర్లకు రావాల్సిన డీఆర్, 11వ పీఆర్సీ తదితర బకాయిల విషయంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. ఎనెల్ హాస్పిటల్ జనరల్ ఫిజీషియన్ హరికృష్ణ, అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమణయ్య, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రఘునాథ్, అటవీ విభాగ అధ్యక్షుడు ప్రసాద్, ఆత్మకూరు, పొదలకూరు యూనిట్ల అధ్యక్షులు శ్రీరాములు, కోటేశ్వరరావు, కార్యదర్శి సుధాకర్, అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు గోపాల్, ధీరేంద్రనాథ్, ఫయాజ్ అహ్మద్, ప్రధాన కార్యదర్శి ఎస్పీవీఎస్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

### పోలీసుల అదుపులో మోసకారులు



పోలీస్‌స్టేషన్ వద్ద బాధితులు

నెల్లూరు(క్రైమ్): ఉమ్రా యాత్ర పేరిట భారీ వసూళ్లకు పాల్పడి బోర్డు తిప్పేసిన ట్రావెల్స్ సంస్థకు చెందిన ఇద్దరు ప్రతినిధులను వేదాయపాళెం పోలీసులు అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నారని సమాచారం. పోలీసుల వివరాల మేరకు.. ఉమ్రా యాత్రకు వెళ్లాలనే ఉద్దేశంతో చెన్నైకు చెందిన ఓ ట్రావెల్స్ సంస్థను జిల్లాకు చెందిన పలువురు సంప్రదించారు. ఒక్కొక్కరికీ రూ.55 వేల వరకు ఖర్చవుతుందని సదరు సంస్థ ప్రతినిధులు తెలిపారు. అనంతరం జిల్లాకు చెందిన 140 మంది వద్ద నగదు వసూలు చేసి వీసాలు పంపుతామని చెప్పారు. రోజులు గడుస్తున్నా ఎలాంటి సమాచారం లేకపోవడం, సంస్థ ప్రతినిధుల ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసి ఉండటంతో మోసపోయామని గ్రహించిన బాధితులు.. పోలీసులను ఆశ్రయించారు. నెల్లూరులోని వెంగళరావ్‌నగర్ ఎస్సీసీ కాలనీకి చెందిన ఖాదర్ షరీఫ్ ఫిర్యాదు మేరకు వేదాయపాళెం పోలీసులు కేసును గత నెల 17న నమోదు చేశారు. సాంకేతికత ఆధారంగా దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో సంస్థ ప్రతినిధులు జాఫర్, షాకీర్‌ను అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నారు.

**కోయంబత్తూరులోనూ మోసం**

కోయంబత్తూరులోనూ పలువుర్ని వీరు ఇదే తరహాలో మోసగించారనే అంశాన్ని పోలీసులు గుర్తించారు. వారి నుంచి ఒత్తిళ్లు అధికమవడంతో నెల్లూరు జిల్లాలో వసూలు చేసిన నగదును కోయంబత్తూరు బాధితులకు అందజేశామని పోలీసుల విచారణలో వెల్లడించారని తెలిసింది. ఉమ్రా యాత్ర పేరిట విజయవాడలో వసూలు చేసి నెల్లూరు జిల్లా వారికి అందించేందుకు యత్నిస్తుండగా, పట్టుబడ్డారని సమాచారం. కాగా ప్రతినిధులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారనే సమాచారం అందుకున్న బాధితులు పెద్ద సంఖ్యలో వేదాయపాళెం పోలీస్‌స్టేషన్‌కు ఆదివారం రాత్రి చేరుకున్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు. పోలీసుల లెక్కల మేరకు జిల్లాలోని 140 మంది వద్ద నుంచి రూ.70 లక్షల వరకు వసూలు చేశారని సమాచారం. సంస్థ ప్రతినిధుల నుంచి ఎంత మేర రికవరీ జరుగుతుందో వేచి చూడాల్సి ఉంది.

# పట్టుకోండి.. చూద్దాం

మండలంలో విద్యుత్ మోటార్ల దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. తరచూ అర్ధరాత్రి వేళల్లో పొలాల్లో తిరుగుతూ మోటార్లు, వాటిలోని తీగలు, ఇంకా స్టార్టర్లను అపహరిస్తున్నారు. రెండు నెలల వ్యవధిలో 20కి మందికిపైగా రైతులకు చెందిన మోటార్లు చోరీకి గురయ్యాయి. పట్టుకోండి చూద్దామంటూ దొంగలు పోలీసులకు సవాల్ విసురుతున్నారు.

- పేట్రేగిపోతున్న విద్యుత్ మోటార్ల దొంగలు
- గ్రామాల్లో ఏటా పదుల సంఖ్యలో చోరీలు
- పట్టించుకోని పోలీసులు
- ఆందోళన చెందుతున్న రైతులు



గొలగమూడిలో పైపులు కోసి మోటార్‌ను ఎత్తుకెళ్లిన దొంగలు (ఫైల్)

వెంకటాచలం: మండలంలో 50 వేల ఎకరాలకు పైగా వరి, ఇతర పంటలు, కూరగాయలు సాగు చేస్తున్నారు. ఎక్కువ మంది రైతులు చెరువుల ఆధారంగా పంటలు సాగు చేస్తున్నారు. కాగా అన్ని గ్రామాల్లో విద్యుత్ మోటార్లతో పంటలు పండించుకుంటున్నారు. అధికారిక లెక్కల ప్రకారం 2,600 వ్యవసాయ కనెక్షన్లుండగా, అనధికారికంగా మరికొంత మంది మోటార్లను వినియోగిస్తున్నారు. ఇందుకోసం పెద్ద మొత్తంలో ఖర్చు చేస్తుంటారు. అయితే దొంగలు రాత్రి వేళల్లో పంట పొలాల్లో తిరుగుతూ మోటార్లు, విద్యుత్ తీగలు, స్టార్టర్లను ఎత్తుకెళ్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

**పక్కాగా రెక్కీ వేసి..**

తిక్కవరప్పాడు, కంటేపల్లి, గొలగమూడి, కందలపాటు, కనుపూరు, కురిచెర్లపాడు, పాలిచెర్లపాడు తదితర గ్రామాల్లో విద్యుత్ మోటార్ల ఆధారంగా ఎక్కువమంది పంటలు పండిస్తున్నారు. దొంగలు పగలు రెక్కీ వేసి ఎక్కడెక్కడ మోటార్లు ఉన్నాయో తెలుసుకుంటున్నారు. పక్కా ప్రణాళికతో రాత్రి వేళల్లో చోరీకి పాల్పడుతున్నారు. రెండు నెలల వ్యవధిలో తిక్కవరప్పాడులో ఐదు, కంటేపల్లిలో రెండు, గొలగమూడిలో మూడు, అనికేపల్లిలో రెండు, కురిచెర్లపాడులో రెండు, కసుమూరు పంచాయతీ అనకాడవడ్డిపాళెంలో రెండు మోటార్లను ఎత్తుకెళ్లారు.

**విఫలం**

రోడ్డు పక్కన వాహనాల రాకపోకలకు అనుకూలంగా ఉన్న పొలాలనే దొంగలు లక్ష్యంగా చేసుకుంటున్నారు. కొన్ని సంవత్సరాలుగా వేసవి కాలంలో విద్యుత్ మోటార్లు చోరీ చేస్తున్నా ఆ ముఠాను పట్టుకోవడంలో పోలీసులు విఫలమవుతున్నారు. అర్ధరాత్రి సమయంలో తిరిగే వాహనాల కదలికలపై నిఘా పెడితే దొంగలను పట్టుకోవచ్చని రైతులు చెబుతున్నారు. కొన్నేళ్లలో చోరీకి గురైన మోటార్ల గురించి ఫిర్యాదు చేయడమే గానీ ఎక్కడా రికవరీలు చేసిన దాఖలాల్లేవని అన్నదాతలు వెల్లడిస్తున్నారు. ఇప్పటికైనా పోలీసులు నిఘా ఉంచి దొంగల్ని పట్టుకోవాలని కోరుతున్నారు.



తిక్కవరప్పాడులో మాయమైన మోటార్

**నిఘా పెట్టాలి**



రైతుల పొలాల్లోని విద్యుత్ మోటార్లను గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి వేళల్లో చోరీ చేస్తున్నారు. దీంతో రైతులు చాలా నష్టపోతున్నారు. రాత్రి వేళల్లో పోలీసులు నిఘా పెట్టాలి. నిందితులను అదుపులోకి తీసుకోవాలి.

– నలగర్ల రంగయ్య, గొట్లపాళెం

**నష్టపోతున్నాం**



పంట పొలాల్లోని విద్యుత్ మోటార్లను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేస్తున్నారు. మళ్లీ మోటార్లు కొనుగోలు చేయలేక రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. మా గ్రామంలో ఏటా మోటార్ల చోరీతో తీవ్రంగా నష్టపోతున్నాం. పక్కా ప్రణాళికతో అర్ధరాత్రి సమయంలో పొలాల వద్దకు వచ్చి దొంగతనం చేస్తున్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

– కందిమళ్ల చంద్రమోహన్, తిక్కవరప్పాడు

### శేషవాహనంపై ఉదయకళేశ్వరుని విహారం



కొడవలూరు: మండలంలోని గండవరంలో వెలసిన గంగా పార్వతి సమేత ఉదయకళేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి శేషవాహనసేవను వేడుకగా ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ధ్వజారోహణాన్ని నిర్వహించారు. శేషవాహనంపై గ్రామోత్సవాన్ని జరిపారు. పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధానార్చకుడు బండారు సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈఓ బండి శాంతయ్య, చైర్మన్ ఆలం మాలకొండయ్య పర్యవేక్షించారు.

## ఆపస్ సేవా కార్యక్రమాలు అభినందనీయం



మాట్లాడుతున్న రాధాకృష్ణారెడ్డి

ఇందుకూరుపేట: ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) సేవా కార్యక్రమాలను ఎఫ్‌సీఐ మాజీ డైరెక్టర్ దువ్వూరు రాధాకృష్ణారెడ్డి అభినందించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు టాలెంట్ టెస్ట్‌ను కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన ఆరుగురికి ఇంటర్మీడియట్‌లో 100, 75, 60 శాతం చొప్పున ఫీజులో రాయితీని విశ్వసాయి విద్యాసంస్థల వారు ఇవ్వనున్నారని నిర్వాహకులు తెలిపారు. అనంతరం విజేతలను రాధాకృష్ణారెడ్డి అభినందించి బహుమతులను అందజేశారు. ఆపస్ జిల్లా అధ్యక్షుడు రాజగోపాలాచార్యులు, ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, ఇందుకూరుపేట అధ్యక్షుడు కేశవరామ్, సుబ్బరాయుడు, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వేడుకగా నాగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ



జ్వాలాముఖి అమ్మవారి ఆలయంలో నాగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

తోటపల్లిగూడూరు: మండలంలోని వరిగొండలో కొలువైన జ్వాలాముఖి అమ్మవారి ఆలయంలో ఆదివారం నూతన నాగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం వేడుకగా జరిగింది. నాగేంద్ర స్వామి, రాహు, కేతు, నాగమ్మ, జంట నాగులు జీర్ణోద్ధరణ కార్యక్రమన్ని చేపట్టారు. ఆలయ వేద పండితులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు, విశేష అభిషేకాలను నిర్వహించారు. నాగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠకు స్థానికులు గండవరపు శ్యామలమ్మ, వారి వంశీయులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో విగ్రహ దాతలు గండవరపు శ్యామలమ్మ, గండవరపు శకుంతలమ్మ, గండవరపు పట్టాభి, గండవరపు సూరి తదితరులు పాల్గొన్నారు.

## ఇజ్తిమాకు పోటెత్తిన భక్తజనం



కొడవలూరు: మండలంలోని చంద్రశేఖరపురంలో నిర్వహిస్తున్న ఇజ్తిమాకు ముస్లింలు ఆదివారం భారీగా తరలివచ్చారు. దాదాపు లక్ష మంది వచ్చి ఉంటారని భావిస్తున్నారు. హాజరైన వారికి మంచి నీరు, భోజన వసతిని వీపీఆర్ ఫౌండేషన్ కల్పించగా, అన్నదానాన్ని పలు స్వచ్ఛంద సంస్థలు నిర్వహించాయి. కొడవలూరు సీఐ సురేంద్రబాబు, కొడవలూరు, విడవలూరు ఎస్సైలు కోటిరెడ్డి, నరేష్‌యాదవ్, 350 మంది పోలీస్ సిబ్బందితో బందోబస్తు చర్యలు చేపట్టారు.

### గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో మనుబోలమ్మ

మనుబోలు: మనుబోలు గ్రామదేవతలు మనుబోలమ్మ, నాగార్పమ్మలకు ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఫణీంద్రశర్మ గ్రామదేవతలకు పంచామృతాభిషేకం చేసి ప్రత్యేక అలంకరణ, అనంతరం విశేష పూజలు జరిపించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో గ్రామ దేవతలను దర్శించుకుని సలిపిండి, పొనకాలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు.

### విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

ఇందుకూరుపేట: పదో తరగతిలో మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచే విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను ఈ ఏడాది అందజేయనున్నామని దాసరి సుహాసిని చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు దాసరి విజయ్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక నేత దువ్వూరు కల్యాణ్‌కుమార్‌రెడ్డి సహకారంతో వీటిని అందజేయనున్నామని వివరించారు.

### కారు డ్రైవర్ ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): పుట్టింటికి భార్య వెళ్లిందనే మనస్తాపంతో కారు డ్రైవర్ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కపాడిపాళెంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. కపాడిపాళేనికి చెందిన శ్రావణ్‌కుమార్ (26), సుమాంజలి దంపతులకు ఇద్దరు పిల్లలు. కారుడ్రైవర్‌గా శ్రావణ్‌కుమార్, నర్సుగా ఆమె పనిచేస్తున్నారు. దంపతుల నడుమ ఇటీవల స్వల్ప వివాదం చోటుచేసుకుంది. దీంతో భర్తపై అలిగి తన పుట్టింటికి ఆమె వెళ్లారు. మనస్తాపానికి గురైన శ్రావణ్‌కుమార్ తన ఇంట్లోని ఫ్యాన్‌కు దుప్పటితో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతుడి తల్లి కుమారి ఫిర్యాదు మేరకు సంతపేట పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## బందోబస్తు నడుమ గ్రూప్ – 2 పరీక్ష



కోవూరు: పరీక్ష రాసి వస్తున్న అభ్యర్థులు



వెంకటాచలం: పరీక్ష కేంద్రం వద్ద బందోబస్తు

కోవూరు: మండలంలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాలలో గ్రూప్ – 2 పరీక్షలను పోలీస్ బందోబస్తు నడుమ ఆదివారం నిర్వహించారు. ఉదయం నిర్వహించిన పరీక్షకు వెయ్యి మందికి గాను 899 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షకు వెయ్యి మందికి గానూ 105 మంది గైర్హాజయ్యారు.

వెంకటాచలం: వెంకటాచలంలోని క్యూబా ఇంజినీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రంలో ఆదివారం గ్రూప్–2 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 480 మంది అభ్యర్థులకు 424 మంది హాజరయ్యారు. ప్రశాంతంగా పరీక్షలు జరిగేందుకు పరీక్ష కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

**రోస్టర్ మేరకు నిర్వహించి ఉంటే బాగుండేది**



రోస్టర్ విధానంలో పరీక్షను నిర్వహించి ఉంటే బాగుండేది. అలా కాకపోవడంతో భవిష్యత్తులో ఇబ్బందులొచ్చే అవకాశం ఉంది. అసలు పరీక్ష జరుగుతుందో లేదోననే అయోమయం నెలకొంది.

– దీప్తి

**మొక్కుబడిగా జరిపారు**



గ్రూప్ – 2 పరీక్షను మొక్కుబడిగా జరిపారు. నిరుద్యోగులపై ప్రేమతో పరీక్షను నిర్వహించలేదు. మా జీవితాలతో చెలగాటమాడటం తగదు.

– మార్కండేయులు

**ఎమ్మెల్సీ ఎన్నికల కోసమేనా..?**



త్వరలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికల కోసమే పరీక్షలను నిర్వహించినట్లు ఉంది. వీటి వల్ల నిరుద్యోగులకు ఎలాంటి ఉపయోగం ఉండదు.

– జగదీష్

## బ్రహ్మోత్సవ కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారం



కొడవలూరు: మండలంలోని గండవరంలో వెలసిన గంగా పార్వతి సమేత ఉదయకళేశ్వరుని బ్రహ్మోత్సవ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారాన్ని ఆలయ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించారు. చైర్మన్‌గా ఆలం మాలకొండయ్య, సభ్యులుగా పిట్టు రంగనాథమ్మ, గుర్రాల భవాని, మడపర్తి విజయమ్మ, కావలి విజయలక్ష్మి, నెల్లూరు మాధవి, ప్రదీప్‌కుమార్‌రెడ్డి, జడ్డా రవీంద్రబాబు, నాపా బాలకృష్ణయ్య, తుమ్మల శ్రీనివాసులు, పరాంకుశం శ్రీనివాసాచారి, బండారు సుబ్రహ్మణ్యం ప్రమాణం చేశారు. పౌరసరఫరాల శాఖ రాష్ట్ర డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, ఈఓ శాంతయ్య, సర్పంచ్ రాజకుమారి, నేతలు పెనాక వెంకటేశ్వర్లురెడ్డి, సురేష్, గుర్రాల కోటయ్య, గోపీ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదమరిస్తే అంతే



ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

మనుబోలు: మండలంలోని బద్దెవోలు–కొలనుకుదురు రోడ్డు మార్గంలో బద్దెవోలు, కట్టువపల్లి గ్రామాల మధ్య ఓ మలుపు వద్ద కల్వర్టు ప్రమాదకరంగా మారింది. కండలేరు ఉప కాలువపై చాలా కాలం క్రితమే కల్వర్టును నిర్మించారు. ఇప్పటికే కల్వర్టు పిట్టగోడ పూర్తిగా కూలిపోయింది. ఈ మార్గంలో ప్రయాణించే వాహనదారులు ఏ మాత్రం అప్రమత్తంగా లేకున్నా.. కాలువలో పడిపోయే ప్రమాదం ఉంది. గతంలో ఇక్కడ జరిగిన ప్రమాదాల్లో ఇద్దరు మోటర్ సైకిలిస్టులు మృతి చెందగా పదుల సంఖ్యలో గాయపడిన ఘటనలు ఉన్నాయి. అధికారులు స్పందించి కల్వర్టుకు పిట్టగోడ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

# ఆ మలుపులు.. మృత్యుదారులు



అయ్యగారిపాళెం వద్ద ప్రమాదకర మలుపు

పొదలకూరు: మండలంలోని పొదలకూరు–నావూరు మార్గంలో పదుల సంఖ్యలో ప్రమాదకర మలుపులు ఉన్నాయి. ఆయా మలుపుల్లో తరచుగా రోడ్డుప్రమాదాలు సంభవిస్తున్నాయి. రోడ్డుకు ఇరువైపులా కర్రతుమ్మ చెట్లు ఏపుగా పెరగడంతో ద్విచక్రవాహన చోదకులకు ఇబ్బందిగా మారింది. హారన్ ఇవ్వకుండా మలుపు తిరిగేందుకు ప్రయత్నిస్తే ఎక్కడ ప్రమాదం జరుగుతుందోనని భీతిల్లుతున్నారు. అయ్యగారిపాళెం, నందివాయ, అమ్మవారిపాళెం, నావూరుల వద్ద మలుపులు అధికంగా ఉన్నాయి. కొత్తగా ఈ మార్గంలో వెళ్లే వాహనచోదకులకు ప్రమాదకర మలువపుల వల్ల ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. సంబంధిత అధికారులు మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయలేదు. గ్రామాల సమీపంలో మాత్రం ఆయా గ్రామస్తులు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసుకుని ప్రమాదాలను కొంత వరకు నివారిస్తున్నారు. మిగిలిన మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులను వెంటనే ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందంటున్నారు. ఆటో డ్రైవర్లు మితిమీరిన వేగంతో పెద్దశబ్దంతో డీజేలు పెట్టి నడుపుతుండడంతో ఎదురొచ్చే వాహన చోదకులు హారన్ ఇచ్చినా.. వినిపించని పరిస్థితి. దీంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయి. మలుపులు దాటాకా కొన్ని చోట్ల రోడ్డు ధ్వంసం అయింది. ఫలితంగా నావూరుపల్లి, నావూరు, చెన్నారెడ్డిపల్లి, భోగసముద్రం గ్రామస్తులు ఆల్తుర్తి మీదుగా పొదలకూరుకు వస్తున్నారు.